క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీసీహెచ్‌ఎస్



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని డిస్ట్రిక్టు కో–ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్‌ఎస్) జయకుమార్ సోమవారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇప్పటివరకు డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఉద్యోగ విరమణ చేయటంతో ఆ స్థానంలో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జయకుమార్‌ను డీసీహెచ్‌ఎస్ గా బదిలీ చేశారు.

ఆధ్యాత్మిక సేవకులకు గౌరవ సన్మానం

శ్రీరామపాదక్షేత్రంలో జనరంజకంగా ముగిసిన నవహారతులు

నాగాయలంక: కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రంలో గత నెల రోజులుగా నవ్యతతో భక్త జనరంజకంగా సాగిన కార్తిక మాసోత్సవాలు, నిత్య నవ (తొమ్మిది)హారతులు దిగ్విజయంగా ముగిశాయి. ఈ నెల రోజులు అక్కడ ఆధ్యాత్మిక సేవలు అందించిన పలువురిని ఈ సందర్భంగా స్థానిక శ్రీరామ లింగేశ్వరస్వామి మండపంలో ఘనంగా సన్మానించారు. క్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ ఆలూరి శ్రీనివాస రావు నేతృత్వంలో తొలుత నిత్య నవహారతులను భక్తిపారవశ్యంతో సమర్పించిన వేదపండితులు అంబా సాయికిరణ్‌శర్మ, ముదునూరి అచ్యుత శేఖర్ శర్మ, కొతారు నరసింహశాస్త్రిలను సన్మానించారు. వారితో పాటు స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ జంట ప్రతినిధులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణలను కూడా సత్కరించారు.

మంచినీటి పైప్‌లైన్ ద్వారా మురుగునీరు



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి గ్రామ పంచాయతీలో తాగునీరు అందించే పైప్‌లైన్ చెడిపోయి దాని ద్వారా మురుగునీరు వస్తోందని, వెంటనే పైప్‌లైన్ మార్పించాలని ఎంపీడీవో జె.స్వర్ణభారతికి విజ్ఞప్తి చేశారు. స్పందనలో భాగంగా సోమవారం మోపిదేవి ఎంపీటీసీ–2 కొమ్ము పవన్‌కుమార్ మాట్లాడుతూ మోపిదేవిలో సుమారు 40 సంవత్సరాల కిందట వేసిన పైప్‌లైన్ చెడిపోయి, దాని ద్వారా మురుగునీరు తాగునీటి పైప్‌లైన్‌లో కలిసి దుర్వాసన వస్తోందని వెంటనే పైప్‌లైన్ మార్పించాలని కోరారు. కోసూరువారిపాలెం మాజీ ఉపసర్పంచ్, జనసేన పార్టీ నాయకుడు కోసూరు రామాంజనేయులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

అధికారులకు కూటమి నేతల వినతి



కోడూరు: రైతులు పండించిన ధాన్యం కొనుగోలును రైతు సేవా కేంద్రాల వద్ద వేగవంతం చేయాలని కూటమి నేతలు కోరారు. సోమవారం కోడూరు సేవా కేంద్రంలోని అధికారులతో కూటమి నేతలు మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో రైతులు హడావుడిగా యంత్రాల సహాయంతో వరికోతలు కోశారని, వాటిని రహదారుల వెంట ఆరబెట్టారని చెప్పారు. తేమశాతం ఆధారంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో వర్షంలో కూడా రైతులు ధాన్యాన్ని విక్రయించకుండా రాశులుగా పోసుకొనే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అధికారులు రైతులకు వెంటనే గోనె సంచులు అందించి, ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని కూటమి నేతలు అధికారులను కోరారు.

సీపీఆర్‌పై అవగాహన



అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య భారతి అఖిల భారత స్వచ్ఛంద సంస్థ ధన్వంతరి జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ వంగర శేషగిరిరావు సీపీఆర్ చేసే విధానాన్ని ప్రదర్శించి విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతంతమాత్రంగానే ధాన్యం కొనుగోళ్లు

- సరిగా పనిచేయని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- తక్కువకు విక్రయించుకునే పరిస్థితి కల్పిస్తున్నారంటూ రైతుల ఆవేదన
- పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 69 వేల ఎకరాల్లో వరి సాగు
- 1.58లక్షలు మెట్రిక్ టన్నులు దిగుబడి అంచనాలు
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 20,607 మెట్రిక్ టన్నులు మాత్రమే

పెడన: రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకంటే తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఎన్డీయే కూటమిలో ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలు 55కు పైగా ఉన్నాయి. ప్రతి రైతు సేవా కేంద్రం(ఆర్‌ఎస్‌కే)వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని(పీపీసీ– ప్యాడీ పర్చేజ్ సెంటర్)ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ఏర్పాటు చేయలేదు. డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారానే కాకుండా రైతుమిత్ర బృందం ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1.58 లక్షల వరకు మెట్రిక్ టన్నులు దిగుబడి అయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖ గణాంకాలు. సార్వా ప్రారంభంలో వర్షాలు పడటంతో దిగుబడి తగ్గుతుందని అంచనాలున్నాయి. వరి కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరవడం, తెరిచినా కొనుగోలు సక్రమంగా చేయకపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతిలేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.



పెడన ఆర్‌ఎస్‌కేలో రైతు నుంచి వేలిముద్రలు తీసుకుంటున్న పీపీసీ సిబ్బంది

అసలు కొనుగోలే చేయని కేంద్రాలు....

పెడన నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొన్నిచోట్ల అసలు ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి ఉంది. పెడన మండలంలో నందిగామ, కృత్తివెన్ను మండలంలో చిన పాండ్రాక–2, నీలిపూడి, శీతనపల్లి ఆర్‌ఎస్‌కేలు, గూడూరు మండలంలో తరకటూరు, కోకనారాయణపాలెం ఆర్‌ఎస్‌కేలు ఉన్నాయి.

దిగుబడి అంచనా ఇలా...కొనుగోలు అలా...

పెడన మండలంలో 21వేల ఎకరాల్లో వరి సాగు అవగా సుమారు 61వేల మెట్రిక్ టన్నులు దిగుబడికి అవకాశాలున్నాయి. ఇప్పటివరకు 6,140 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. గూడూరు మండలంలో 20వేల ఎకరాల్లో వరిసాగు కాగా 59 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనాలున్నాయి. ఇప్పటివరకు పీపీసీల ద్వారా కేవలం 4,208 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారు. బంటుమిల్లి మండలంలో 12,800 ఎకరాలకు 28వేల మెట్రిక్ టన్నుల దిగుబడికి అవకాశం ఉండగా సుమారు 7వేల మెట్రిక్ టన్నులు కొన్నారు. కృత్తివెన్ను మండలానికి వస్తే 15వేల ఎకరాలకు 32వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అయ్యే అవకాశాలున్నాయి. ఈ మండలంలో ఇప్పటివరకు 3,263 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అదేమని అధికారులను ప్రశ్నిస్తే ఇంకా కోతలు కోయలేదని, కొంత నేరుగా రైతులు మార్కెట్ చేసేసుకున్నారని చెబుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా తక్కువ ధరకు విక్రయించుకోవాల్సి వచ్చిందనే వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. అధికారులు మాత్రం రైతులు ఇబ్బంది పడకుండా ఉండటానికి ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఎవరైతే ఆఫ్‌లైన్ ద్వారా అమ్మకాలు చేశారో వారి నుంచి ఇప్పుడు ఆన్‌లైన్ వివరాలను స్వీకరిస్తున్నామని చెబుతున్నారు.

మిల్లర్లతో సంబంధం లేకుండా చేస్తేనే మేలు



మిల్లర్ల దగ్గరకు రైతులు వెళ్లకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతం పరీక్షించుకుని వెళ్లాక కూడా మిల్లర్లు మళ్లీ తేమ శాతం చూడటం, తేమ ఎక్కువగా ఉందంటూ రేటు తగ్గించడం చేస్తున్నారు. ఈ తలనొప్పి ఎందుకని రైతులు దళారులను ఆశ్రయించి నష్టానికి పంటను తెగనమ్ముకుంటున్నారు. గతంలో రైతుల నుంచి ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేసేది. అలాంటి విధానం తీసుకువస్తే ప్రయోజనం ఉంటుంది.

–కోన రామకృష్ణ, తరకటూరుపాలెం రైతు

'మీకోసం'కు అధికారుల డుమ్మా



పెడన: మండల స్థాయిలో ఒకే చోట మీకోసం కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం పెడన తహసీల్దారు కార్యాలయంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఎంపీడీవో, పోలీస్, విద్యుత్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్, వెలుగు, ఉపాధి హామీ, విద్య, పంచాయతీరాజ్ శాఖల నుంచి అధికారులు హాజరయ్యారు. వ్యవసాయ, పశుసంవర్ధక, వైద్యారోగ్యం, ఇరిగేషన్, గ్రామీణ నీటిపారుదల, ఎక్సైజ్ తదితర శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరయ్యారు. సమాచారం ఇచ్చినా కొందరు రాకపోగా, మరికొందరికి సమాచారం లేదని పేర్కొనడం గమనార్హం.

పైడమ్మ జాతర వేలం పాటల ద్వారా రూ.16.92 లక్షలు

పెడన: పట్టణంలో ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు జరిగే సమయంలో దుకాణాలు, శిడిబండ్లు, మేకపోతులు, కోళ్ల తదితర వాటికి సంబంధించిన వేలం పాటల ద్వారా రూ.16,92,000 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో టీవీవీ మోహనరావు అన్నారు. సోమవారం పైడమ్మ దేవస్థానం ఆవరణలో వేలం పాటలను నిర్వహించారు. ఈవో మోహనరావుతో పాటు దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ సమక్షంలో పాటదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,84,500 అధికంగా ఆదాయం వచ్చిందని వివరించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కృత్తివెన్ను: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఏపీవో సైదారావు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా చేసిన పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు జరిపిన పరిశీలనలకు సంబంధించిన నివేదికలను ఈ ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు ఆయన వివరించారు.

కార్తిక దామోదరుడికి ఘన వీడ్కోలు

కోడూరు: కార్తికమాసం ముగింపును పురస్కరించుకుని కార్తిక దామోదరుడికి భక్తులు ఘన వీడ్కోలు పలికారు. సోమవారం వేకువ జామునే సమీప కాలువలు, నదుల వద్ద మహిళలు పరమశివుడికి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అరటిదొన్నెల్లో కార్తిక దీపాలను వెలిగించి వాటిని కాలువలు, నదుల్లో వదిలి తమ భక్తిభావం చాటుకున్నారు. కోడూరు నుంచి అవనిగడ్డ వరకు ప్రధాన పంటకాలువ వద్దకు మహిళలు కార్తిక దామోదరుడికి వీడ్కోలు పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వి.కొత్తపాలెం, జయపురం, విశ్వనాథపల్లి, నాయుడుపేట, వంతెన సెంటర్ వద్ద మహిళల కోలాహలం అధికంగా కనిపించింది.

మొలకలొస్తున్నాయి



చల్లపల్లిలో రాశులు తడవడంతో మొలకలు వచ్చిన ధాన్యం



పెదప్రోలులో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతు

- గత ఏడాది కొనుగోలు చేసిన ఎంటీయూ 1262, 1318 రకాలు ఈ ఏడాది కొనడం లేదు
- వారం రోజుల నుంచి రహదారుల పక్కన రాశుల వద్ద రైతుల పడిగాపులు

అవనిగడ్డ: ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసిన ధాన్యం రకాలను ఇపుడు కొనుగోలు చేయడం లేదు. గత ప్రభుత్వంలో ఎంటీయూ 1262, 1318 వరి రకాలను కల్లాల్లోనే కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం వాటిని కొనకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ రకాలను యంత్రాలతో కోయించి వారం రోజుల నుంచి ధాన్యం రాశుల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ధాన్యం మొలకలు రావడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులున్నారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ ఏడాది 98,645 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో ఎంటీయూ 1061 రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1262, 1318 రకాలను సాగు చేశారు. ఈ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు సరఫరా కూడా చేసింది. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రకం ధాన్యంను కల్లాల్లోనే కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం వీటిని కొనేందుకు మిల్లర్లు ముందుకు రావడం లేదు. దీంతో వారం రోజుల నుంచి రహదారుల పక్కన రాసులు పోసి రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఎంటీయూ రకాన్ని బస్తా (76కిలోలు) రూ.1,500కి కొనుగోలు చేస్తుండగా, వాటికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన 1262, 1318 రకాలను కొనుగోలు చేయక పోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడుతుండటం, వీటి వద్ద కాపలా కాయలేక కొంతమంది రైతులు బతిమలాడితే బస్తా రూ.1350 నుంచి రూ.1400కు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల బస్తాకు వంద నుంచి రూ.150 వరకు నష్టపోవాల్సి వస్తోంది. వర్షాలకు ధాన్యం రాసులు తడిసి పలుచోట్ల మొలకలు రావడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గత ఏడాది కొన్నారు.. ఈ ఏడాది కొనడం లేదు



ఎంటీయూ 1318, 1262 వరి రకాలను ప్రభుత్వం రాయితీలు ఇచ్చి విత్తనాలను రైతులకు అందించింది. గత సంవత్సరం ఈ రకాలను కల్లాల్లోనే కొనుగోలు చేశారు. ఇప్పుడు కొనడం లేదు. 13 ఎకరాల్లో 1318 రకం సాగు చేశాను. రోడ్డు పక్కన పోసి ఆరబెట్టుకుంటున్నాం. వర్షాలు పడుతున్నాయి. ఎన్నాళ్లు కాపలా కాయాలో తెలియడం లేదు.

– బాచు మోహనరావు, పెదప్రోలు, మోపిదేవి మండలం

ఐదు రోజుల నుంచి పడిగాపులు



కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా ఎంటీయూ 1318 వరి విత్తనాలు తీసుకున్నాం. గత సంవత్సరం బాగానే కొన్నారు. ఇప్పుడు కొనడం లేదు. ఐదు రోజుల నుంచి రోడ్డు పక్కన ఆరబెడుతున్నాను. మబ్బులు, వర్షాల వల్ల ఏమవుతాయోననే ఆందోళనతో కంటి మీద కునుకు రావడం లేదు. ప్రభుత్వం వెంటనే వీటిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– డొక్కు శ్రీనివాసరావు (సుబ్బయ్య), పెదప్రోలు

పోయి రావమ్మా..పోలి..పోయి రావమ్మా!



మచిలీపట్నం రాబర్ట్‌సన్ పేటలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని కొలనులో దీపాలు వదులుతున్న భక్తులు

పోలి పాడ్యమి పురస్కరించుకుని దీపకాంతులతో పోలమ్మను స్వర్గానికి పంపాలని తద్వారా కార్తిక మాసంలో ఈశ్వరుడి కృపా కటాక్షాలు ఉంటాయని భక్తులు పోలిస్వర్గం పూజల కోసం ఎదురు చూడటం ఆనవాయితీ. కార్తిక మాసోత్సవాలు ముగియడంతో సోమవారం తెల్లవారు జామున 3గంటలకే కృష్ణానదికి చేరుకున్న మహిళలు పుణ్యస్నానాలు, పూజలు తదుపరి సంప్రదాయ రీతిలో పరస్పరం నుదుట బొట్లు పెట్టుకుని, తాంబూలాలను ఇచ్చి పుచ్చుకోవడం ఆధ్యాత్మిక అనుభూతిగా పంచుకున్నారు. పిల్లలు, వృద్ధులు, పురుషులు సైతం ఉత్సాహంగా అరటి దొప్పల్లో కార్తిక వత్తులతో దీపాలు వెలిగించి నదిలోకి సాగనంపారు. నదికి రాలేని భక్తులు పంట కాలువల్లో, ఇళ్ల వద్ద బేసిన్‌లలో నీటిని నింపి అరటి దొప్పలలో వత్తులు వెలిగించి పోలమ్మను సాగనంపారు.

–నాగాయలంక/పెడన/బంటుమిల్లి/కృత్తివెన్ను/మచిలీపట్నంటౌన్





నాగాయలంకలో శివయ్యకు జలాభిషేకం చేస్తున్న మహిళలు ; నదిలో వదిలిన అరటి దొప్పలు



బంటుమిల్లి కాలువలో దీపాలను వదులుతున్న భక్తులు



కృత్తివెన్నులో తెల్లవారుజామున పోలిస్వర్గం పూజలు చేస్తున్న మహిళలు



నాగాయలంకలో అరటి దొప్పల్లో పోలమ్మను సామూహికంగా సాగనంపుతున్న మహిళలు





పెడన రామరాజు చానెల్‌లో పోలి స్వర్గానికి దీపాలను వదులుతున్న భక్తులు ; నాగాయలంక తీరాన పోలి పాడ్యమి పూజలకు పోటెత్తిన భక్తజనం

వక్ఫ్ బోర్డు రద్దు హేయనీయం

వక్ఫ్‌బోర్డు ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షుడు సలార్‌దాదా

మచిలీపట్నంటౌన్: వక్ఫ్‌బోర్డును కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 75 ద్వారా రద్దు చేయటం హేయనీయ చర్య అని వక్ఫ్‌బోర్డు ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షుడు, మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నియమించిన వక్ఫ్‌బోర్డును ఉపసంహరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం విచారకరమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2018 వరకూ వక్ఫ్‌బోర్డును నియమించకుండా 2018లో ఎన్నికల ముందు వక్ఫ్‌బోర్డును హడావుడిగా నియమించారన్నారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల కేటగిరిలో చైర్మన్‌గా ఉన్న జలీల్‌ఖాన్ ఓటమిపాలవటంతో అర్హత కోల్పోయారన్నారు. మరో ఇద్దరు డైరెక్టర్‌లు రాజీనామా చేశారన్నారు. మరో ఇద్దరు స్కాలర్లకు అర్హతలేనందున ఆ ఖాళీలను మాత్రమే భర్తీ చేశారన్నారు. చంద్రబాబులా బోర్డు మొత్తాన్నీ రద్దు చేయలేదన్నారు. ఐదేళ్ల తర్వాతనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023లో పూర్తిస్థాయిలో వక్ఫ్‌బోర్డును నియమించిందన్నారు. సభ్యులు చైర్మన్‌ను ఎన్నుకునే దశలో నాడు టీడీపీ నాయకులు కోర్టులో నాలుగు రిట్ పిటీషన్‌లు వేసి నిలుపు చేశారని, ఆ అంశం ప్రస్తుతం కోర్టులోనే ఉందన్నారు. కోర్టు పరిధిలో ఉన్న వక్ఫ్‌బోర్డు కమిటీని ఎలా రద్దు చేస్తారని ఆయన ప్రశ్నించారు.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

గూడూరు: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలో ఐదుగుళ్లపల్లి, మల్లవోలు, ముక్కొల్లు, రామన్నపేట, తరకటూరు రేషన్ డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె వెల్లడించారు. ఐదుగుళ్లపల్లి, ముక్కొల్లు, తరకటూరు జనరల్ కేటగిరీలో ఉండగా, మల్లవోలు బీసీ–బి, రామన్నపేట ఎస్టీ కేటగిరీలో ఉన్నట్లు తెలిపారు. సదరు పోస్టులను ఈనెల 20న నిర్వహించనున్న రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని, ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

రైతులకు శిక్షణ

అవనిగడ్డ: పులిగడ్డ సచివాలయం వద్ద సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ రైతులకు పంట సాగు సలహాలు, మార్కెటింగ్ సదుపాయాలను వివరించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి కమలాకర్, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.